గంగా హారతి



పొదలకూరు: మండలంలోని మరుపూరు గ్రామంలో పూర్తిస్థాయిలో నిండిన చెరువులకు గ్రామస్తులు శుక్రవారం గంగా హారతి ఇచ్చారు. ఈ రబీ సీజన్‌లో పంటలు పండే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందారు. అయితే మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల గ్రామంలోని నాయుడు చెరువు, చిన్నచెరువు, పెద్దచెరువుల్లోకి నీరు చేరి నిండుకుండలా మారాయి. ఈ నేపథ్యంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేగంగా పనులు



ముత్తుకూరు: మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు వేగంగా నిర్వహించారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో గ్రామాలు చీకట్లో మునిగిపోయాయి. ట్రాన్స్‌కో సిబ్బంది, పంచాయతీ ఉద్యోగులు రంగంలోకి దిగి చెట్లను తొలగించారు. శుక్రవారం నాటికి 99 శాతం గ్రామాల్లో సరఫరాను విద్యుత్ సిబ్బంది పునరుద్ధరించారు. కాగా తుఫాన్ కారణంగా విద్యుత్ శాఖకు సుమారు రూ.కోటి మేరకు నష్టం వాటిల్లినట్లు అంచనా.

వై ఏపీ నీడ్స్ జగన్



వెంకటాచలం: మండలంలోని పాలిచెర్లపాడులో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే లబ్ధి చేకూర్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, జిల్లా నాయకుడు కొణిదెన విజయభాస్కర్ నాయుడు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరి విత్తనాలు సిద్ధం



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ముత్తుకూరు: మిచాంగ్ తుఫాన్ కారణంగా మండలంలో సుమారు 5,000 ఎకరాల్లో వరి నారుమడులు, 110 ఎకరాల్లో వేరుశనగ పైరు నీట మునిగింది. ఈ నేపథ్యంలో రైతుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీపై వరి విత్తనాలు అందించినట్లు వ్యవసాయాధికారి జ్యోత్స్న రాణి శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా కేఎన్ఎం 1638 రకం, ఎన్ఎల్ఆర్ 34449 రకం వరి విత్తనాలు 7 క్వింటాళ్ల మేరకు వచ్చినట్లు చెప్పారు. శనివారం నుంచి వరి విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

40 మందికి శిక్షణ



శిక్షణకు హాజరైన వారు

కొడవలూరు: మండలంలోని నాయుడుపాళెం ఎస్‌జీఓ సెంటర్‌లో శాలివాహన డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కోవూరు, కొడవలూరు, అల్లూరు, కావలి, జలదంకి మండలాల్లోని 40 మంది కుమ్మరి కుల వృత్తిదారులకు శుక్రవారం శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నైపుణ్యం లేక ఉపాధి అవకాశాలు దక్కక ఇబ్బంది పడుతున్న వారికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. తద్వారా ఉపాధి పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు గొట్టం బ్రహ్మయ్య, ఇనకోట రఘురామయ్య, మాచవరం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం ఆదుకుంది'

కోవూరు: తుఫాన్ సమయంలో విడవలూరు మండలం దంపూర్ గ్రామం గిరిజన కాలనీ ప్రజలను ప్రభుత్వం ఆదుకోలేదని ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన వార్తపై స్థానిక ప్రజలు విస్మయం చెందుతున్నారు. ప్రభుత్వ అధికారులు తమను సురక్షిత ప్రాంతానికి తరలించి అల్పాహారం అందించారని కూడా తెలిపారు. అయితే స్థానిక సర్పంచ్ బాధితులను సచివాలయానికి తరలించి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారని వారు వెల్లడించారు. ప్రభుత్వం ఎవర్నీ పట్టించుకోలేదని తెలుగుదేశం నాయకులు బాధితులకు భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారని పచ్చపత్రిక రాయడం వాస్తవం కాదన్నారు. పునరావాస కేంద్రంలో ఉన్న ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకొందన్నారు.

శనగ పంట పరిశీలన

ముత్తుకూరు: మిచాంగ్ తుఫాన్ కారణంగా నీట మునిగిన వేరుశనగ పంటను వ్యవసాయాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వినీత, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న రాణి తదితరులు పంటపాళెం, నారికేళపల్లి పంచాయతీల్లోని పంటలను చూశారు.

గ్రామాల్లో క్రీడా సంబరాలకు శ్రీకారం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



క్రీడా కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడా సంబరాలకు శ్రీకారం చుట్టిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో క్రీడా కిట్లను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదు రకాల గ్రామీణ క్రీడల్లో యువతీ, యువకులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సామగ్రి అందించారన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా కూడా బంగారు భవిష్యత్‌ను పొందవచ్చని చెప్పారు. అందువల్లే ప్రభుత్వం రూ.వంద కోట్లు వెచ్చించి క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టిందన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేలా కృషి చేయాలని కోరారు.

వెలుగులోకి తెచ్చేందుకు..

డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో క్రీడా సామగ్రిని పంపిణీ చేసినట్లు తెలిపారు. కోవూరు నియోజకవర్గం కబడ్డీలో ఎంతో ప్రఖ్యాతి గాంచిందని, ఆ ప్రతిష్టను నిలిపేలా క్రీడాకారులు ప్రతిభ చూపాలని కోరారు. అనంతరం రైతులకు 80 శాతం రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ జి.విజయకుమార్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గంధం వెంకటశేషయ్య, మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ జి.జ్యోతి, జెడ్పీటీసీ పి.సరోజనమ్మ, ఎంఈఓ జి.వసంతకుమారి, ఏఓ లక్ష్మి, సర్పంచ్ కామాక్షి, నాయకులు ఎస్.తిరుపతమ్మ, కె.నాగేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.చిన్నా, పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

పేదల కోసం పథకాల అమలు



కార్డు అందజేస్తున్న అధికారులు

మనుబోలు: కేంద్రం పేదల కోసం పలు పథకాలను అమలు చేస్తోందని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. మనుబోలు-1, వెంకన్నపాళెం సచివాలయాల్లో శుక్రవారం వికసిత్ భారత్ యాత్రపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు ఆయుష్మాన్ భవ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కంచి పద్మమ్మ, పెంచలమ్మ, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శివకృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సజావుగా రేషన్ పంపిణీ



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న డీటీ

కోవూరు: పేదలకు రేషన్‌ను సకాలంలో పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్ ఆదేశించారు. కోవూరు మండలంలోని పాటూరు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న రేషన్ పంపిణీని ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మజ

కోవూరు: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలంటూ మండలంలోని గంగవరం గ్రామంలో ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఎం.పద్మజ మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఫారం-6 నింపి ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. శనివారంతో నమోదు ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్ కుమార్ విద్యార్థులకు సూచనలు ఇచ్చారు.

వైభవంగా కల్యాణం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి శుక్రవారం అభిషేకం, కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జాతీయ మెగా లోక్ అదాలత్ నేడు



మాట్లాడుతున్న జడ్జి

కోవూరు: కోవూరులోని కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి పి.చైతన్య తెలిపారు. శుక్రవారం వివరాలు వెల్లడించారు. రాజీకి వీలు పడే కేసులను ఇందులో సులువుగా పరిష్కరించుకోవచ్చన్నారు.

నేడు మంత్రి కాకాణి రాక

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఉదయం 11.30 గంటలకు మండలంలోని కొత్తకంభాలపల్లికి విచ్చేస్తారని దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి

కోవూరు: రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోవూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎస్.హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, వ్యవసాయాధికారిణి ఇందిరావతి సూచనలు ఇచ్చారు.

పంచాయతీల ఆదాయం పెంచాలి

మనుబోలు: గ్రామ పంచాయతీల ఆదేయం పెంచేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ కృష్ణవేణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో ఆదాయవనరులను గుర్తించాలన్నారు. 432, 227, 30 జీఓలపై అవగాహన కల్పించారు. పన్నుల వసూలు, పాలనా విభాగాలపై అవగాహన కల్పించారు.

క్రీడా కిట్ల పంపిణీ నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రీడా కిట్లను మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని టౌన్, రూరల్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఆధునిక పద్ధతిలో వరినాట్లు వేయాలి

- డీడీఏ శివనారాయణ



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పొదలకూరు: 'మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వరి సాగు చేసే రైతులు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. నాట్లు వేసుకునేందుకు సమయం కలిసి రావాలంటే ఆధునిక పద్ధతులను పాటించాలి.' అని డీఆర్సీ డీడీఏ జి.శివనారాయణ సూచించారు. మండలంలోని తాటిపర్తి, మహ్మదాపురం, విరువూరు గ్రామాల్లో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో శుక్రవారం డీడీఏ క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడుతూ రైతులు డ్రమ్ సీడర్‌ను ఉపయోగించి నేరుగా విత్తనాలను విత్తుకోవడం లేదా వెదజల్లడం చేయాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త విజయకుమార్ నాయక్ మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్, ఏఓలు మధురిమ, ఎ.వాసు, ఆర్బీకే సిబ్బంది మౌనిక, భారతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే లక్ష్యం



బ్యాగ్‌ను అందజేస్తున్న పార్టీ నేత

తోటపల్లిగూడూరు: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ అన్నారు. మండలంలోని చింతోపు సచివాలయ పరిధిలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు, నేతలు లేబూరు మల్లికార్జున్, కోనేటి రాజు, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డులో విద్యుత్ సరఫరా పనులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: తుఫాన్ కారణంగా నగర పంచాయతీ పరిధిలోని 16 వార్డులో దెబ్బతిన్న విద్యుత్ లైన్లను సరిచేశారు. కౌన్సిలర్ ప్రమీలమ్మ పనులను పర్యవేక్షించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అడిగిన వెంటనే విద్యుత్ మరమ్మతు పనులకు సిబ్బందిని పంపించినందుకు చైర్‌పర్సన్ ఎం.సుప్రజకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



విడవలూరు: వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: 'కృష్ణాపురం వారు అడిగిన విధంగా సుమారు రూ.75 లక్షలతో సీసీ రోడ్లు అభివృద్ధి చేశాం. మరో రూ.10 లక్షలు వస్తే రోడ్లు అన్ని పూర్తవుతాయి. ఈ నెలాఖరుకు ఆ నిధులు మంజూరు చేయిస్తా.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మైపాడు మజరా కృష్ణాపురం, గంగపట్నం మజరా కాలువమూలకండ్రిగ గ్రామాల్లో రైతులకు శుక్రవారం ఆయన అసైన్‌మెంట్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణాపురం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అన్నారు. ఈ గ్రామం పుట్టినప్పటి నుంచి భూములకు పట్టాలు పంపిణీ చేయాలని అనేక దఫాలుగా ప్రజలు విన్నవించుకున్నారన్నారు. ఏ నాయకుడు స్పందించిన పాపాన పోలేదన్నారు. స్థానిక యువ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి తనను, కలెక్టర్‌ను కలిసి పట్టాలు వచ్చేలా కృషి చేశారని అభినందించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో గ్రామంలో 33 మందికి 31.64 ఎకరాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశామన్నారు. తొలిసారి కృష్ణాపురం వచ్చినప్పుడు పలు విషయాలు చెప్పారన్నారు. షార్ ఏర్పాటు సమయంలో తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి అక్కడి నుంచి ప్రజలను ఇక్కడికి తీసుకొచ్చి ఇళ్లు కట్టించారని తెలిపారన్నారు. పూర్తి హక్కులు కల్పించి వారికి పట్టాలను అందజేస్తున్నామన్నారు. అవి చేతికి అందడంతో రైతు భరోసా, ప్రభుత్వ రుణాలు వంటివి తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. దశాబ్ద కాలం నుంచి ఉన్న చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ముఖ్యమంత్రి చూపారన్నారు. ఇందుకూరుపేట మండలంలో 124 ఎకరాలను చుక్కల భూముల నుంచి తొలగించి 109 మందికి రైతులకు ఆనందం కల్పించామన్నారు. తొలుత ఎమ్మెల్యే కృష్ణాపురంలో 33 మంది 31.64 ఎకరాలు, మైపాడులో 16 మందికి 15.82, కాలువమూలకండ్రిగలో 38 మందికి 35.95, ముదివర్తిపాళెంలో 11 మందికి 3.74, కొమరికలో ఇద్దరికి 0.72, లేబూరులో ఒకరికి 0.42 ఎకరాలకు సంబంధించిన పట్టాలను కృష్ణాపురం, కాలువమూలకండ్రిగ గ్రామాల్లో అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీహరికోట ప్రసాద్, పామంజి నరసింహ, చిన్నయ్య, కావలి రవి, మైపాడు, గంగపట్నం సర్పంచ్‌లు సంగం వెంకయ్య, నిరంజన్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ

విడవలూరు: మండలంలోని ఊటుకూరు గ్రామంలో శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1,687 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి 1,054 మంది రైతులకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. నాలుగున్నరేళ్లుగా కనిపించని కొందరు పగటి వేషగాళ్లు ఎన్నికలు దగ్గర కొస్తున్న సమయంలో ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. తుఫాన్‌ను కూడా రాజకీయం చేస్తున్నారని అలాంటి వారిని నమ్మొద్దని, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. మీ కుటుంబంలో మంచి జరిగిందా? లేదా? అని ప్రజలు ఆలోచించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్షయ్య, మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి, రాష్ట్ర యువత కార్యదర్శి బెజవాడ వంశీకృష్ణారెడ్డి, నాయకులు జనార్దనరెడ్డి, ప్రభాకర్, తిరపతయ్య, శీనయ్య, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.